

ఆ రోజు శనివారం అవడంచేత పెందలాడే ఆఫీసుపని ముగించుకుని, అలవాటుప్రకారం వేరుగా క్లబ్‌కు వెళ్ళి తనివితీరా మూడు సెట్లు టెన్నిస్ ఆడుకుని, అలిసిపోయి వరండాలో ఈజీఛైర్‌లో విశ్రాంతి తీసుకుంటూ మామూలుగా సిగార్ వెలిగించాను. బ్రిడ్జి ఆటకోసం ఇంకా మిత్రులు రాలేదని ఎదురు చూస్తున్నాను. చేతిలో ఏదో పత్రిక చూస్తున్నానన్నమాటేగాని మనసు అదో మాదిరిగా ఉంది ఎందుచేతో. ఇంతలో సుబ్బారావూ, చలపతీ వచ్చారు. సుబ్బారావు వస్తూనే. . . "ఏం గురువుగారూ . . . ఏదో ఆలోచనలో ఉన్నట్టున్నా"రని పలకరించాడు. ఇవ్వాళ కోరమ్ పూర్తవలేదే అన్నాడు చలపతి. ఇంకా జడ్జీగారు వచ్చే టైము కాలేదన్నాను నేను. ఇంతలో ఆయన కారు రానే వచ్చింది.

ఆయన . . . వస్తూనే . . . "శాస్త్రీ, ఇవ్వాళ టెన్నిస్ బాగా దంచేసినట్టున్నారే" అన్నారు. నలుగురం బ్రిడ్జ్‌కి ఉపక్రమించాం. మా పార్ట్నరు ఫైవ్‌డైమండ్స్ వరకూ బిడ్‌చేసి నా వైపు ఆదుర్దాగా చూస్తుంటే. . . ఏం ఫర్వాలేదు అన్నట్టుగా పొగ వదిలి ముక్కలు పరిచాను. "ఈ రోజు శాస్త్రి మామూలుగా లేడు ఏదో ఉంది. . ." అన్నాడు సుబ్బారావు. "క్లబ్‌లో కూడా ఆలోచన ఏమిటోయ్?" అన్నాడు చలపతి. జడ్జీగారు ఒక నవ్వు నవ్వి. . . "మీ రెందుకో ముభావంగా ఉన్నారు" అన్నారు. "మనం తప్పక ఈసారి గేం చేయాలండీ!" అన్నాను. ఆట ముగింపుకు రాబోతున్నది . . . నేను

**'వెంచాశా'**

నిజంగానే ఏవో ఆలోచనల్లో ఉన్నట్టున్నది. వాళ్ళు తెలీకుండానే నేను తీవ్రంగా ఉన్నానేమో మరి.

"జీవితం చాల విచిత్రమైనదండీ. . ." అన్నాను నేను.

"ఇప్పుడే నీవు ఏదో కొత్తగా కనిపెట్టినట్టున్నావే" అని సుబ్బారావు నవ్వేశాడు.

పోయిన శనివారం జరిగిన సంఘటన జ్ఞాపకానికి వచ్చి ఇంకా నేను ఆలోచిస్తూనే ఉన్నాను.

"మీ ఆలోచనలకు కారణమేమిటో త్వరగా చెబితే బావుంటుంది" అని అన్నారు జడ్జిగారు. ఆయనకు కబురంటే చాలా సరదా. అందరినీ నవ్విస్తూంటారు. జడ్జీగారు మా స్నేహితుల్లో ఒకరైనప్పటికీ ఆయనంటే ఒక విధమైన భయమూ, గౌరవమూ ఉన్నాయి మాకు. "మీరు చెప్పటంలేదు. ఏదో ఉంది విశేషం. . మీ ముఖకవళికలను బట్టి

ఆ మాత్రం పసిగట్టగలం" అన్నారు ఆయన.

"బ్రిడ్జి, కబుర్లూ రెండూ కుదరవండీ. . ." అన్నాను తీవ్రంగా.

అయితే లాన్‌లోకి పోదాం అని బోయ్‌ని పిలిచి కుర్చీలు వేయమన్నాడు సుబ్బారావు. "కూల్‌డ్రింక్స్ తెప్పించు చలపతీ. . మీకో తమాషా సంఘటన చెబుతాను. . ." అన్నాను. అందరూ నా వైపు కుతూహలంగా చూస్తున్నారు.

"పోయిన శనివారం . . ." అంటూ మొదలు పెట్టాను. ఏమీ తోచక రెండో ఆట ప్లాజాసినిమాకు వెళ్ళాను. సినిమాలో నా పక్కనే ఒకామె కూర్చున్నది. ఇంటర్వెల్లో ఆమెవైపు చూశాను. ఆమె చాలా అందంగా ఉన్నా ముఖంలో విషాదచ్ఛాయలున్నట్టున్నాయి. లైట్‌బ్లూ నైలాన్‌చీర, దానికి మ్యాచ్‌అయ్యే జాకెట్టూ ఆమె పసిమిఛాయకు ఇంకా అందాన్ని ఇచ్చాయి. వయస్సు సుమారు ముప్పై ఉండవచ్చు. అంతలావు కాదు. . . అంత సన్నం కాదు. మనిషి చాలా సరళంగాను, ఠీవిగానూ ఉంది. ఆమె ఒంటరిగా సినిమాకు ఎందుకు వచ్చిందో అని అనుకున్నాను. సినిమా అయిన తరవాత కారు బయటకు తీసి జనంలోంచి నెమ్మదిగా బయలుదేరి రోడ్డుమీదికి వచ్చాను. . . కొంచెం దూరం పోయిన తరవాత ఆమె వెనకనుండి నెమ్మదిగా నడిచి రావడం చూశాను. కారు ఆపుదామా వద్దా అని ఆలోచిస్తూ నెమ్మదిగా వెళుతున్నాను. ఆమె బహుశా రిక్షాకై కొంచెం దూరం నడుస్తున్నదేమో. ఆమెను వెంబడించే ఉద్దేశం నాకు లేనప్పటికీ. . . ఒక అందమైన స్త్రీ. . . అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా అలా వెళ్ళడం క్షేమకరం కాదేమో అనిపించింది. కారు ఆపడానికే సాహసించాను. కారులోంచి బయటకు వచ్చి, "చూడండీ. . . క్షమించాలి. . . మీరేమీ అనుకోకపోతే కారులో ఎక్కండి మిమ్మల్ని డ్రాప్ చేస్తాను . . ." అన్నాను. ఆమె చిరునవ్వు నవ్వి. . "చాలా థాంక్స్. . . మీకు ఇబ్బంది అవుతుందేమో. . . నేను చాలాదూరం పోవాలి" అన్నది. "ఫరవాలే"దంటూ కారుడోర్ తీశాను. ఆమెవచ్చి కూర్చుంది. కొంచెంగా చినుకులు పడుతున్నాయి. కారు నెమ్మదిగా దూసుకుపోతున్నది. కొంచెంసేపు ఉభయులం మౌనంగానే ఉన్నాం . . . సంభాషణ ప్రారంభిస్తూ. . .

"ఈ రోజు వెదర్ హఠాత్తుగా మారిపోయింది. వర్షంకూడా రానురాను ఎక్కువవుతున్నది" అన్నాను.

"అవునండీ. . . అందులో అనుకోకుండా. . ఈ రోజు సినిమాకు వచ్చేశాను. చాలా ఆలస్యంకూడా అయింది...మీకు చాలా శ్రమ కలిగిస్తున్నానేమో..." అన్నది నవ్వుతూ.

"నా కేం శ్రమ లేదండీ. . . మిమ్మల్ని క్షేమంగా ఇంటికి చేరుద్దామనే ఉద్దేశ్యంతోటే కారాపాను. . ." అన్నాను, నన్నామె ఎక్కడ అపార్థం చేసుకుంటుందేమో అని. "మీరు కారు స్టార్టుచేస్తున్నప్పుడు చూసి నేనే మిమ్మల్ని లిఫ్ట్‌కోసం అడుగుదామనుకుని.. మీకు శ్రమ కలిగించడం ఎందుకని ఆగిపోయాను. . ."

"మీరు సహజంగా అందంగా ఉన్నా. . ఈ లైట్ బ్లూచీరెలో మరీ అందంగా ఉన్నారు."

వర్షం ఎక్కువ కావడం ఆరంభించింది. తారురోడ్డు

**ఒంటరిపాటున వయసులో ఉన్న అందగత్తె కనిపిస్తే, ఎంతటి మగవాడి కైనా కాస్త మనసు చలిస్తుంది. తాను ఊహించినట్లు ఆమె సుఖాన్వేషణలో లేదని, కలవారి యింటి ఇల్లాలని గ్రహించినపుడు సంస్కారం మేల్కొనాలి. ఆపై పరిణామాలు ఎప్పుడు ఎలా మారతాయో ఎలా చెప్పడం?**

అంతా తడిసిపోయి. . . ఎదురుగా వచ్చేకార్లలైట్ల ప్రతిబింబాలు తమాషాగా కన్పిస్తున్నాయి. ఆమెరోడ్డు వైపే విచిత్రంగా చూస్తున్నది. కారువైపరు అటూ ఇటూ కదులుతూ అద్దంమీద పడిన నీటిబిందువులను తుడిచివేస్తున్నా . . . ఆ నీటిబిందువులు మాకేం ఫర్వాలేదన్నట్టుగా అద్దాన్ని అంటి పెట్టుకుని వంపులుగా తిరుగుతూ వెళుతున్నాయి. కారుటాపుమీద పడుతున్న చినుకులు సన్నగా. . . మస్తితంగా శబ్దంచేస్తూ మహావిద్వాంసుని చేతిలోని మృదంగధ్వనులను జ్ఞాపకానికి తెస్తున్నాయి.

డాష్‌బోర్డ్‌లోని సిగిరెట్టూ, అగ్గిపెట్టే అందుకుందామని పక్కకు వంగి లైటు వేశాను. అప్రయత్నంగా ఆమె చేయి నా చేయికి తగిలి సారీ అన్నాను. ఆమె చిరునవ్వు నవ్వి మళ్ళీ రోడ్డువైపు చూస్తున్నది.

"వర్షం చాలా అందంగా ఉందండీ. . ." అన్నది. ఇది నా కర్థం కాలేదు.

"ఈ వైపరు అటూ ఇటూ వేగంగా కదులుతూంటే నా కేమిటో భయంగా ఉన్నదండీ. . . దయచేసి ఆపితే బావుంటుందేమో. . ." అన్నది నావైపు ప్రశ్నార్థకంగా చూస్తూ. .

"వైపరు ఆపేస్తే రోడ్డు సరిగా కనపడదు. ." అన్నాను ముక్తసరిగా.

"మీ కభ్యంతరం లేకపోతే నేను డ్రైవ్ చేస్తా" నంటూ. . . తను స్టీరింగు తీసుకుని వెంటనే వైపరు ఆపేసింది . . కారు నడుపుతున్నంతసేపు వర్షాన్ని గురించి...ప్రకృతినిగురించిపొగుడుతూనేఉంది.

"మానవుడు ప్రకృతిని ఆరాధించడం ఎందు కంటారూ?" అని ఆమె ప్రశ్న.

"మానవుడు భగవంతుని సృష్టి గనక" అన్నాను.

"నాంపల్లిలో రెస్టారెంటు దగ్గిర కారు ఆపుతాను అక్కడ కొంచెం టీ తాగి టాక్సీలో నేను ఇంటికి వెళతాను మీరు అక్కడనుండి వెళ్ళొచ్చు...ఇది మీకు అంగీకారమే అనుకుంటాను" అన్నది. అలాగే రెస్టారెంటు దగ్గిర ఆగి టీ తీసుకున్నాము. ఆమె కొంచెం టిఫిన్‌కూడా తీసుకున్నది. టిఫిన్‌తీసుకుంటూ తను ఆ రోజు భోజనం చేయలేదనీ, ఆకలి అవడంచేత తప్పనిసరిగా టిఫిన్ తీసుకోవలసి వచ్చిందనీ అన్నది. ఆమె ఇంటికి వెళ్ళడానికి ఇంకా సందేహిస్తున్నట్టుగా ఆలస్యం చేస్తున్నది. టాక్సీని పిలుద్దామని రెండడుగులు ముందుకు వేశాను ఇంతలో ఆమె ముందుకు వచ్చి "నాకు అప్పుడే వెళ్ళాలని లేదు. నేను మీతో మీ ఇంటికి వస్తాను మీకు అభ్యంతరం లేకపోతే" అని మనోవేదనతో బాధపడుతున్నవాళ్ళమాదిరిగా దీనంగా అన్నది. "నాకేం అభ్యంతరం లేదు. మిమ్మల్ని చూస్తూంటే మీరు గొప్పింటిఇల్లాలుగా కన్పిస్తున్నారు. మీరు ఒంటరిగా సినిమాకు ఎందుకు వచ్చారో, వచ్చి ఇంటికి తిరిగి వెళ్ళడానికి ఎందుకు సందేహిస్తున్నారో, మీ ముఖంలోని విషాదచ్ఛాయలకు కారణమేమిటో, మీకు వైపరంటే భయం ఎందుకో తెలుసుకోవాలని ఉంది. నా ఈ అనవసర కుతూహలానికి మీరేమీ అనుకోరనుకుంటాను" అని నెమ్మదిగా అన్నాను. ఆమె అందం, గాంభీర్యం, ఠీవి, చిరుమందహాసం ... మెరిసేకళ్ళు చూసి నేను కొంచెం చలించినమాట వాస్తవం ఆవిడ మళ్ళీ నవ్వడం ప్రారంభించింది. "మీరడిగిన వాటిల్లో ఆఖరుదానికి సమాధానం చెబుతాను. నాకు వేగంగా కదిలే ఏ వస్తువు చూసినా భయంగా ఉంటుంది. అది నాలోని బలహీనతేమో... వరిగెత్తే గుర్రం, దూసుకుపోయే రైలు మెలికెలు తిరిగి వెళుతున్న పాము, విపరీతమైన శబ్దంచేస్తూ వెళుతున్న జెట్ విమానం...ఇంకా ఇలాంటివెన్నో... వైపరు కదలడం చూస్తే పాముని భ్రాంతి కలిగింది. అప్పుడప్పుడు కలలో పాములు కన్పిస్తూంటాయి. మనసు ఆందోళనగా ఉంటుంది. నేను ఎదురుచూస్తున్న ప్రకృతిలోని ప్రశాంతత, గంగాజలంలోని నైర్మల్యం... మీలో నాకు కన్పించి. . . మీ రెందుకో నన్ను ఆకర్షించారు. ఈ ఆకర్షణలో విపరీతార్థానికి తావు లేదు. మీతో కొంచెంసేపు మనసువిప్పి మాట్లాడాలని, నా మనోవేదనను తెలియచేద్దామని . . మీ రెందుకో నాకు ఆప్తులుగా కన్పించారు . . నేను వివాహితను. ఈ సమయంలో పరాయి మగవాడిని ఒంటరిగా కలుసుకుని. . అతనితో కారులో వచ్చి. . అతనింటికే వెళ్ళి మాట్లాడడానికి సాహసించడం నాలోని దౌర్బల్యమేమో తెలియదు. మళ్ళీ చెబుతున్నాను. మీలోని ఆప్యాయత నన్ను ఆకర్షించింది. . ఇక వెళదాం పదండి మీ ఇంటికి" అంటూ వచ్చి నా కారులో కూర్చుంది. ఈమె మనస్తత్వం నా కర్థం కాలేదు . . . అంది. నా మనసు గుర్రంలా పరిగెడుతున్నది. నాలో నాకు తెలినిశక్తి ఏదో. . గుర్రానికి కళ్ళెంవేస్తూ "ఆగు... ఆగు.." అంటున్నది. నే నేదో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను. ఆమె భుజంమీద ఎందుకో చెయ్యి వెయ్యాలని. . . ఆమె శరీరస్పర్శకోసం. మనసు తహతహలాడుతున్నది. సందేహిస్తున్నాను. నా లోని శారీరకశక్తి లేవో పోరాటంలో ఉన్నట్టు గమనించాను. నా గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. . . నాలోని పశుత్వమేమో బహుశః అనుకోకుండానే గగుర్పాటుతో నా ఎడంచెయ్యి ఆమె భుజంమీదకు వెళ్ళింది. ఆమె చిరునవ్వు నవ్వుతూ నెమ్మదిగా నా చేయి భుజంమీదనుండి తీసేస్తూ... "మీరింకా నన్ను సరిగా అర్థం చేసుకోలేదు. . ."

ఆమె ముఖకవళికలో కొంచెం మార్పు గమనించాను. నేను తప్పుచేసినవాడిమాదిరి కుంచించుకు పోయాను. ఆమె మళ్ళీ నవ్వుతూ... "ఇంకా మీ ఇల్లు ఎంత దూరం? . . ." అన్నది. మరో అయిదు నిమిషాలకు ఇల్లు సమీపించాం. మా ఇంటిముందున్న తోటచూస్తూ. . తోటలోకి ప్రవేశించి. . "మీ తోట చాలా అందంగా ఉన్నదండీ. . ." అన్నది. "అవును మీలాగే!" అని నవ్వేశాను.

ఆమె ముఖంలో పరిపూర్ణవికాసం కన్పించింది. డ్రాయింగ్‌రూమ్‌లో గోడలకున్న ఫోటోలు, పెయింటింగ్స్ చూస్తూ. . . "అద్భుతం. . అత్యద్భుతం. . ." అన్నది. నాకు ఫోటోగ్రఫీఅంటే ఆసక్తి అనీ, అవి ఎక్కడెక్కడ తీసినవీ. . వాటి వివరాలు చెప్తూ. . ఇంతకూ "మీ విషయం చెప్పారు గారు. . ." అన్నాను ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూస్తూ. .

"ఇది మన ప్రథమ పరిచయం కాబట్టి అన్ని విషయాలూ ఒకసారే చెప్పను. . . మీ పరిచయంవల్లా, స్నేహంవల్లా కలిగిన ఈ అనుభూతి నాకు ప్రశాంతత నిచ్చింది. మీలోని సోదరవాత్సల్యం. . మీ ఇంటి వాతావరణం. . మీ నిర్మలమందహాసం. . మీలోని సహృదయతనూ చూస్తుంటే మీరు గొప్ప కళారాధకులేమో అన్పిస్తుంది ... మిమ్మల్ని తరచూ కలుసుకుంటుండే అవకాశాన్నిస్తే. . . చాలా సంతోషం" అన్నది సోఫాలో విశ్రమిస్తూ. నా కెందుకో ఆమెను చూడగానే ఆమెకు తప్పక సంగీతం వచ్చిఉండాలని అనుకున్నాను.

"మీ కింకా వివాహం కాలేదా?" అని ఆమె ప్రశ్న.

"వివాహం అయికూడా ప్రస్తుతం బ్రహ్మచారినే. మా శ్రీమతి వాళ్ళ నాన్నగారూ వాళ్ళతో కొడైకెనాల్ వెళ్ళింది విశ్రాంతి కోసం. . ." అన్నాను.

"మీ రిద్దరూ చాలా అదృష్టవంతులు."

"మీతో దురదృష్టవంతులెవ్వరో తెలుసుకోవచ్చా" అన్నాను.

"ఉభయులం" అన్నది నవ్వుతూ. .

"ఇంతకూ నేను మొదట్లో అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే సంభాషణ దోర్లిస్తున్నారు. మీరు చెప్పక తప్పదు. . ." అన్నాను. ఆమె చెప్పింది.

"అయితే వినండి. . . ఇలా రావడంలో పొరపాటు నాదేనేమో. . ఆర్థికంగానూ హోదాలోనూ మాకు ఏ లోటూ లేదు. మా శ్రీవారు చాలా చదువుకున్న వారు. కొండంత ఆస్తి ఉన్నది. అదికాకుండా ఆయన వ్యాపారంలో లక్షలు ఆర్జిస్తున్నారు. కావలసినంత పలుకుబడి ఉన్నది. జీవితం అతి వేగంగా గడిపే వాళ్ళలో ఆయనొకరు. కాఫీకూడా నిదానంగా తీసుకోవడం నేను చూడలేదు. ప్రతిపనీ అవతల ఏదో మునిగి పోతున్నట్లుగా. . పరిగెత్తుతూ చేస్తారు. ఆయన ఇంట్లో ఉండడమే కొద్ది క్షణాలు. . ఆ సమయంలో భోజనం చేయడంకూడా హడావిడే. పేరుప్రతిష్ఠలు, హోదా. . . అంటే ఆయనకు ప్రాణం. నేనంటే కూడా చాలా ఇష్టం. కాని వ్యాపారవిషయాల్లోని తొందరపనుల్లో కొంచెం చిరాకుగా ఉంటారు. ఆ చిరాకు ప్రతి విషయంలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఆయన వైఖరి చూస్తుంటే. . . పరిగెత్తిదూసుకు పోయేరైలు జ్ఞాపకం వస్తుంది. నేను ఎంతో అందంగా ఉంటానని మావాళ్ళు అంటారు. నేను అందంగా ఉన్నదీ లేనిదీ చూడటానికే ఆయనకు తీరిక ఉండదు. పాపం. . నా కప్పుడప్పుడు జాలివేసి నవ్వువచ్చినా కొన్ని సమయాల్లో మనస్సు చివుక్కుమంటూ ఉంటుంది. పది రోజుల క్రితం ఒక రోజు వారి ఆఫీసుకు ఫోన్ చేశాను. "మంచి సినిమా ఉంది. త్వరగా వచ్చేయండి వెళదాం" అని. "నా కర్జంటుగా మీటింగ్ ఉన్నది.



ములుపు చిత్రం—టి. కె. సత్యనారాయణ (హైదరాబాద్-29)

రేపు విమానంలో కలకత్తా వెళదాం. . ఇంకా సామెయిర్ టిక్కెట్ రాలేదు. బహుశా కలకత్తానుండి ఢిల్లీ వెళ్ళవలసి ఉంటుంది. . ." అంటూ ఏదో చెప్పుకు పోయారు. ఆయన ఫోన్లో మాట్లాడినా హడావిడిగానే ఉంటుంది. ఫోను పెట్టేసి నాలోని కన్నీరును తుడుచు కుంటూ. . . ఏదో పత్రిక చదువుతూ. . . ఆ రోజు భోజనంకూడా చేయకుండా పడుకున్నాను. వారెప్పుడో పది గంటలకు. . కొంచెం తూలుతూ వచ్చి పడుకున్నారు. మీరు పొరపడతారేమో. మా వైవాహిక జీవితంలో. . . శారీరకసుఖానికి ఏ అంతరాయమూ లేదు. అయినా నా కెందుకో ఏదో పెద్ద వెలితి ఉన్నట్లు. . ఏదో తెలిని అసంతృప్తి నన్ను వెంటాడుతూ ఉంటుంది. మనసు విప్పి శ్రీవారితో ఏమని చెప్పను? ఏదైనా చెప్పడానికి ప్రయత్నించినా వినడానికి టైము లేనట్లు గాబరాను ప్రకటిస్తారు. నిజానికి ఈ రోజు నా పుట్టినరోజు. . నాకు నచ్చిన ఈ చీర కట్టుకుని శ్రీవారితో ఈ రోజు తీరుబాటుగా ముచ్చటిద్దామని ఉవ్విళ్ళూరాను. ఆయనకు జ్ఞాపకం ఉన్నదో లేదో తెలియదు. "అర్జంటు పనులున్నాయి. కొంచెం ఆలస్యంగా వస్తాను. . ." అని ఫోన్ చేశారు. తొమ్మిది గంటలవరకూ చూశాను. ఏం మనిషి! అని విసుగు వచ్చింది. నా కెందుకో దుఃఖం కట్టలు తెంచుకువచ్చింది. 'వైవాహికజీవితం అంటే ఇదేనా?'. . . అన్పించింది. అయినా నేను వివాహిత స్త్రీని కనక భర్తను నేనే అపార్థం చేసుకుని అనవసరంగా నిందిస్తున్నానేమోనని నాలో నేను తర్కించుకున్నాను. ప్రశాంతత కోసం. . . ఎందుకో ఒకటి రెండు గంటలు బయటికి వెళ్ళి అలా తిరిగి రావాలనిపించింది. శ్రీవారు వస్తే భోజనం వడ్డించమని నాయరుతో చెప్పి ఇలా అనుకోకుండా సినిమాకు వచ్చాను. ఇల్లు కదలి ఒంటరిగా ఎప్పుడూ రాలేదు. మొదట్లో కొంచెం భయంవేసినా. . . ఇప్పుడు గుండెరాయి చేసుకున్నాను. నాకు తెలిసి నేను ఏ తప్పూ చేయలేదు. అందుకు మీరే సాక్ష్యం. . ." అంటూ కళ్ళు ఒత్తుకున్నది. నాకు జాలి వేసింది. మా చెల్లి జ్ఞాపకానికి వచ్చింది.

"మీ రిలా అధైర్యపడకూడదు. . ఇది జీవితం. . కష్టం. . సుఖం. . . మంచి చెడూ. . శాంతి. . అశాంతి. . అన్నీ ఉంటాయి. మీరేమీ అనుకోకుంటా ఉంటే ఒక విషయం అడుగుతాను. జవాబు చెప్పండి. నిర్మొహమాటంగా అన్నాను. మీ శ్రీవారు అలా ఎందుకు ఉంటున్నారో ఎప్పుడన్నా ఆలోచించారా? వారిని ఎప్పుడైనా దగ్గరికి తీసుకుని. . అప్యాయంగా. . వారి తెలివితేటలనూ, పేరుప్రతిష్ఠలనూ. . ప్రతిభా విశేషాలనూ కొనియాడి. . . ఆయనకు సంతోషం ఉత్సాహం. . కలిగించేమాటలు ఎప్పుడైనా అన్నారా? మీ మాటలసందర్భాన్నిబట్టి చూస్తే వారుకూడా అందంగా ఉంటారనుకుంటాను. మీరొకసారి అయినా ఆయనను. . . ఆ డ్రెస్‌లో మీరు ఎంత అందంగా ఉన్నారండీ అని టై సవరిస్తూ. . దగ్గరికి చేరి ప్రేమతో పలకరించారా. . . అని అంటూండగానే ఆమె ముఖం కొంచెం వెలవెలపోవడం చూశాను. ఏదో మహాపరాధం చేసినవాళ్ళమాదిరి అయిపోయింది.

"క్షమించండి. . . వీలైతే మా ఇంటిదగ్గర డ్రాప్ చేస్తారా. మీకు కృతజ్ఞురాల్ని. . . ఇప్పటికే మీకు శ్రమ కల్గించాను." అన్నది. ఆ తరవాత ఆమెను ఇంటిదగ్గర వదిలి వచ్చాను.

"ఈ విషయం మీ శ్రీమతికి తెలిస్తే ఏమన్నా ఉందా?" అన్నాడు సుబ్బారావు.

మరునాడే శ్రీమతికి ఉత్తరం వ్రాశాను జరిగిం దంతా. "మీరు చాలా ఉత్తములు" అని పొగుడుతూ జవాబు వ్రాసింది. కాని ఈ రోజు ఆ అందమయిన పరిచితురాలిదగ్గరనుండి చిన్న కబురు వచ్చింది అని జేబులోఉన్న కాగితం తీసి చదవడం మొదలెట్టాను. "పూజ్యులయిన అన్నగారికి నమస్కారాలు. మళ్ళీ మిమ్మల్ని మరోసారి కలుసుకోవలెనని ఉన్నది. రేపు సాయంత్రం 9 గంటలకు ప్లాజాదగ్గర మీరాకకై నిరీక్షిస్తుంటాము."

"ఆయన, ఒంటరిగా ఆ రోజు ఇల్లు వదిలి వెళ్ళినందుకు ఏం శిక్ష విధించాడో పాపం!" అన్నాడు చలపతి.

"ఇలాంటి విషయాల్లో మీరు చిక్కుకోకూడదు శాస్త్రీ!" అన్నారు జడ్జిగారు.

"లోకానికి కళ్ళుండవు. . చెవులే. . ." అన్నాడు సుబ్బారావు. నే నింకా అవిడ్ని కలుసుకోవాలో అక్కర్లేదో ఏ నిర్ణయానికీ రాలేదు. ఇంకా ఆలోచిస్తూ నే ఉన్నాను.